క్లుప్తంగా...

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక



శామీర్‌పేట్: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు తూంకుంట మున్సిపాలిటీలోని విజ్ఞాన భారతి స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సాయికుమార్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కాగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జట్టులో యుగేందర్ చోటు సంపాదించుకున్నాడు. ఈ మేరకు విద్యార్థులను కరస్పాండెంట్ హన్మంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జంగారెడ్డి, పీడీ ప్రశాంత్‌రెడ్డి అభినందించారు.

బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్‌రెడ్డి



ప్రవీణ్‌రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న మంత్రి మల్లారెడ్డి, కొండల్‌రెడ్డి, రమేశ్

ఘట్‌కేసర్: బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా ఎదులాబాద్‌కు చెందిన కోమటిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి మంగళవారం ఎన్నికయ్యారు. బీఆర్ఎస్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి రమేశ్, కొండల్‌రెడ్డి సమక్షంలో మంత్రి మల్లారెడ్డి ఆయనకు నియామక పత్రం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ అభివృద్ధికి, నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి కృషి చేస్తానని, తనపై నమ్మకముంచి బాధ్యత అప్పగించినందుకు ధన్యవాదాలన్నారు.

బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రచార కార్యదర్శిగా దినేష్



పోచారం: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి ఘట్‌కేసర్ మండల ప్రచార కార్యదర్శిగా ఇస్మాయిల్‌ఖాన్‌గూడకు చెందిన అచ్చిని దినేష్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని జాతీయ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ.. బీసీల సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు.

ఇందిరాగాంధీకి నివాళి



ఘట్‌కేసర్‌లో ఇందిరాగాంధీకి నివాళులర్పిస్తున్న ముత్యాలుయాదవ్, ఆంజనేయులుగౌడ్



ఘనాపూర్‌లో నివాళులర్పిస్తున్న మహేశ్‌గౌడ్, గోపాల్‌రెడ్డి

సీఎం కేసీఆర్ సారథ్యంలోనే తెలంగాణ సుభిక్షం



జవహర్‌నగర్‌లో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి, మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్

- రూ.200 కోట్లతో జవహర్‌నగర్‌ను అభివృద్ధి చేసి చూపించా..
- కార్మిక శాఖ మంత్రి, మేడ్చల్ అభ్యర్థి మల్లారెడ్డి

జవహర్‌నగర్: సీఎం కేసీఆర్ సారథ్యంలోనే తెలంగాణ రాష్ట్ర సుభిక్షంగా మారిందని కార్మిక శాఖ మంత్రి, బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ అభ్యర్థి చామకూర మల్లారెడ్డి అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని మంగళవారం మంత్రి మల్లారెడ్డి, మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీకి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూపి ప్రతిపక్షాలకు ఏమి చేయాలో అర్థం కావడం లేదన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్‌కు తిరుగులేదన్నారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీ గెలవలేక దాడులకు దిగుతోందన్నారు. ఎంపీ ప్రభాకర్‌పై దాడి చేయడం హేయమైన చర్యన్నారు. జవహర్‌నగర్‌లో బీఆర్ఎస్ ఎంతో బలంగా ఉందన్నారు. రూ.200 కోట్లతో జవహర్‌నగర్ కార్పొరేషన్‌ను అభివృద్ధి చేసి తెలంగాణలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అనంతరం పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షులు కొండల్ ముదిరాజ్, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, నాయకులు మేకల అయ్యప్ప, రాజశేఖర్, భార్గవ్‌రామ్, ఉద్యమకారులు జిట్టా శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌చారి, సింగన్న బాలరాజ్, మహేష్, నవీన్, సిద్దులు యాదవ్, సోమయ్య, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్జీకే ఇళ్ల బకాయిలు నేనే చెల్లిస్తా



రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

మంత్రి మల్లారెడ్డి

పోచారం: రాజీవ్ గృహకల్ప ఇళ్ల లబ్ధిదారుల బ్యాంకు బకాయిలను పూర్తిగా తానే చెల్లిస్తానని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి హామీ ఇచ్చారు. అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో బీఆర్ఎస్ నిర్వహించిన రోడ్ షోలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీవ్ గృహకల్ప ఇళ్ల లబ్ధిదారులకు బకాయిలు చెల్లించాలని బ్యాంకు ఏవిధమైన నోటీసులు ఇచ్చినా వాటన్నింటినీ తానే చెల్లిస్తానన్నారు. ఒక్క పైసా కట్టనవసరం లేదన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే కర్తవ్యంగా పనిచేస్తానన్నారు. ఇప్పటికే కాలనీకి సుమారు రూ.6 కోట్ల నిధులు వెచ్చించి అభివృద్ధి చేశామన్నారు. సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేసి, కాలనీ మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. తొలుత అన్నోజిగూడలోని బొడ్రాయి వద్ద సుమారు 100 మంది మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి, మల్లారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి, మరోమారు మంత్రిని చేయాలని వేడుకున్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి, పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు మందడి సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు మెట్టు బాల్‌రెడ్డి, ఆకిటి శైలజ, బాలగోని వెంకటేశ్‌గౌడ్, సింగిరెడ్డి సాయిరెడ్డి, నాయకులు గొంగ్లె బాలేష్, నల్లవెల్లి శేఖర్, సామల బుచ్చిరెడ్డి, సామల సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు బిగ్ షాక్

- మంత్రికి షాకిచ్చిన అధికార బీఆర్ఎస్ కౌన్సిలర్లు



కాంగ్రెస్‌లో చేరిన ఘట్‌కేసర్ కౌన్సిల్ సభ్యులతో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, అభ్యర్థి వజ్రేశ్‌యాదవ్, ప్రభాకర్‌గౌడ్

ఘట్‌కేసర్: బీఆర్ఎస్‌కు ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో మంగళవారం బిగ్ షాక్ తగిలింది. అధికార పార్టీకి చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు మంత్రికి ఝలక్ ఇచ్చారు. పట్టణంలోని టీఎస్ఆర్ గార్డెన్‌లో జరిగిన సమావేశంలో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్‌యాదవ్, ప్రభాకర్‌గౌడ్ సమక్షంలో అధికార బీఆర్ఎస్‌కు చెందిన ఆరుగురు కౌన్సిల్ సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ మరి కొందరు పాలకవర్గ సభ్యులు, ముఖ్యనేతలు కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

అభివృద్ధి లేకపోవడంతోనే..

అనంతరం బీఆర్ఎస్‌లో చేరిన కౌన్సిల్ సభ్యులు నరేశ్‌యాదవ్, సంగీత, నస్రీన్ సుల్తానా, శశికళ, మల్లేశ్, రవీందర్ మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ ప్రకారం అభివృద్ధి పనులు జరగలేదని, దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న రైల్వే వంతెన పనులు పూర్తి చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైనందుకు పార్టీకి రాజీనామా చేశామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్, కుమార్‌ముదిరాజ్, జనార్దన్‌రెడ్డి, యాదగిరి యాదవ్, మశ్చేందర్‌రెడ్డి, అంజిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, దేవేందర్‌ముదిరాజ్, మాధవరెడ్డి, రహీం పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా



మాట్లాడుతున్న వజ్రేశ్ యాదవ్

శామీర్‌పేట్: తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని, అభివృద్ధి చేసి చూపిస్తానని మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్ యాదవ్ అన్నారు. శామీర్‌పేట్ మండలంలోని అలియాబాద్ గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంకుశ పాలనకు చమరగీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్‌కు రాష్ట్ర ప్రజలు ఒక్క అవకాశం ఇవ్వాలని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలు అమలు చేసి ప్రజల జీవితాలను మార్చేస్తామన్నారు. మేడ్చల్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని, అందుకు ప్రతి కార్యకర్త సైనికుడిగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వైస్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదు



దమ్మాయిగూడ మున్సిపాలిటీలో కాంగ్రెస్ కార్యాలయ ప్రారంభోత్సవంలో వజ్రేష్‌యాదవ్

కీసర: రాష్ట్ర ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. మంగళవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలకులు ఎన్ని కుయుక్తులు పన్నినా ఈసారి కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, రాష్ట్రనేత నక్క ప్రభాకర్‌గౌడ్ నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, ముప్ప రామారావు, కీసర మండల అధ్యక్షుడు కోల కృష్ణాయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్ రెడ్డి, కౌన్సిలర్లు పంగ హరిబాబు, గోగుల సరితా వెంకటేష్, పంబాల సరితారమేష్, ముప్ప శ్రీలత, నేతలు సామల శ్రీనివాస్‌రెడ్డి, వరగంటి వెంకటేష్, సోమేష్, మాజీ ఎంపీపీ చిన్నమ రాజుప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



బీఆర్ఎస్‌లో చేరుతున్న ఉపసర్పంచ్, నాయకులు

మేడ్చల్‌రూరల్: మండలంలోని రాజబొల్లారం తండా ఉపసర్పంచ్ నరేశ్, పలువురు కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సుదర్శన్ ఆధ్వర్యంలో మంత్రి మల్లారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్, గ్రామ సర్పంచ్ మంగ్యానాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, మాజీ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు రవినాయక్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

- ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- ఉప్పల్ ఆర్వో అభిషేక్ అగస్త్య (ఐఏఎస్)తో ఇంటర్వ్యూ..

3వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ షురూ..

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా.. ఓటు హక్కును స్వేచ్ఛగా ఉపయోగించుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉప్పల్ నియోజకవర్గ ఆర్వో అభిషేక్ అగస్త్య (ఐఏఎస్) తెలిపారు. ఓటరు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఏ రాజకీయ పార్టీలైనా నిబంధనలకు లోబడి నడవాల్సి ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. ఉప్పల్ ఎన్నికల ఏర్పాట్లపై ఆయన ప్రత్యేకంగా సాక్షి ఇంటర్వ్యూ.. – ఉప్పల్

సాక్షి: ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎన్ని పోలింగ్ బూత్‌లు ఉన్నాయి?

ఆర్వో: కాప్రా సర్కిల్, ఉప్పల్ సర్కిల్ కలిపి మొత్తం 407 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి.

సాక్షి: నియోజకవర్గంలో ఎన్ని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి?

ఆర్వో: దాదాపు 159 వరకు సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి.

సాక్షి: సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

ఆర్వో: సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నాం. వెబ్ కాస్టింగ్ లైవ్ ఉంటుంది. మైక్రో అబ్జర్వర్ టీం పర్యవేక్షిస్తుంది. అదనపు బలగాలు మోహరించి ఉంచుతాం.

సాక్షి: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు అనగా..

ఆర్వో: గత ఎన్నికల్లో 90 శాతానికి పైగా ఓటింగ్ శాతం నమోదైన కేంద్రాలు, 75 శాతానికి పైగా ఒకే పార్టీకి ఓట్లు పోలైన కేంద్రాలు, అధిక ఓట్ల తొలగింపు కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తిస్తున్నాం.

సాక్షి: ఇప్పటి వరకు సి-విజిల్ యాప్ ద్వారా ఎన్ని ఫిర్యాదులు నమోదయ్యాయి?

ఆర్వో: దాదాపుగా 10కి పైగా ఫిర్యాదులు వచ్చాయి. వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం.

సాక్షి: ఇప్పటి వరకు ఎన్నికల నియమావళికి విరుద్ధంగా తీసుకెళ్తున్న నగదును ఎంత స్వాధీనం చేసుకున్నారు.?

ఆర్వో: ఇప్పటి వరకు రూ.1,59,09,371 నగదును స్వాధీనం చేసుకున్నాం. వాటిలో రూ.87,74,130 వరకు ట్రెజరీకి పంపగా, రూ.71,35,241లను ఐటీ డిపార్టుమెంట్‌కు అప్పగించినట్లు తెలిపారు.

సాక్షి: నామినేషన్ల ప్రక్రియ ఎప్పటి నుంచి ప్రారంభమవుతుంది?

ఆర్వో: ఈ నెల 3వ తేదీ నుంచి నామినేషన ప్రక్రియ ప్రారంభమవుతుంది. అభ్యర్థి వెంట కేవలం నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుంది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది.



ఉప్పల్ ఆర్వో అభిషేక్ అగస్త్య(ఐఏఎస్)

సాక్షి: నామినేషన్లను ఎప్పటి వరకు స్వీకరిస్తారు?

ఆర్వో: నామినేషన్లను ఈ నెల 10వ తేదీ వరకు స్వీకరిస్తాం.. ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లో స్వీకరించేది లేదు.

సాక్షి: పొలిటికల్ పార్టీలకు ఎలాంటి సూచనలు చేస్తున్నారు?

ఆర్వో: ర్యాలీలు, సభలు, సమావేశాలకు విధిగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు. అందుకు అన్ని పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు ఇస్తున్నాం. ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం.

పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు



రాంపల్లిదాయరలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నేత భద్రారెడ్డి

కీసర: దేశానికి ఆదర్శంగా నిలిచి రాష్ట్రంలో పేదల కోసం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న బీఆర్ఎస్‌కు ప్రజలు ఓటు వేసి మరోసారి గెలిపించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నేత చామకూర భద్రారెడ్డి అన్నారు. మంగళవారం రాంపల్లిదాయర, భోగారం, అంకిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గంలో మంత్రి మల్లారెడ్డి పెద్దఎత్తున ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు అర్హులైన వారికి సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ఈసారి ఎన్నికల్లో మంత్రి మల్లారెడ్డికి ఓటు వేసి గెలిపించే విధంగా బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలు కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత కందాడి శ్రీకాంత్‌రెడ్డి, ఆయా గ్రామాల బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతకు సర్దార్ పటేల్ చేసిన కృషి మరువలేనిది

జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ



కలెక్టరేట్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ



ఘట్‌కేసర్ బీజేపీ కార్యాలయంలో పటేల్ జయంతి వేడుకలు



అనురాగ్ యూనివర్సిటీలో వలంటీర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మల్లేశ్, వసుధ భక్షి



అత్వెల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

దేశ సమగ్రత, సమైక్యత, భద్రత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి ఎనలేనిదని, ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని మేడ్చల్ జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ అన్నారు. రాష్ట్రీయ ఏక్తా దివస్‌ను పురస్కరించుకొని మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, సిబ్బందితో ఆమె ప్రతిజ్ఞ చేయించారు. దేశ ఐక్యతను కాపాడేందుకు అంకితభావంతో కృషి చేస్తామని, తోటివారందరిలో ఈ భావనను పెంపొందించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తానని, సర్దార్ వల్లభాయ్ పటేల్ దార్శనికతతో దేశానికి సమకూరిన అంతర్గత భద్రతను పటిష్టపరిచేందుకు తోడ్పాటును అందిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో రాంమోహన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. – సాక్షి, మేడ్చల్ జిల్లా

కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి హేయం

మల్కాజిగిరి: ఎంపీ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డిపై దాడి గర్హనీయమని మల్కాజిగిరి అసెంబ్లీ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఈస్ట్ ఆనంద్ అనంత సరస్వతి నగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తన విష సంస్కృతి బయట పెట్టిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. ఎంపీగా రెండుసార్లు ఉన్న ప్రభాకర్‌రెడ్డిపై దాడిని రేవంత్‌రెడ్డి డ్రామాగా చెప్పడం సిగ్గుచేటు అన్నారు. ఎన్నికల్లో పోటీ ఉన్నప్పుడు గౌరవంగా ఓట్ల అభ్యర్థించాలే.. కానీ ఇటువంటి దాడులకు పాల్పడితే మరోసారి తీవ్ర పరిమాణాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో కార్పొరేటర్ మురుగేష్, ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, జగదీష్ గౌడ్, మాజీ కార్పొరేటర్, ఎన్నికల ఇన్‌చార్జి జితేందర్ రెడ్డి, జేఏసీ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డిని గెలిపించాలి



బోడుప్పల్: మేడ్చల్ బీఆర్ఎస్ అభ్యర్థి చామకూర మల్లారెడ్డిని గెలిపించాలని కోరుతూ మంగళవారం 1వ డివిజన్ పరిధిలో బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని ఓటర్ల అభ్యర్థించారు. కార్పొరేటర్లు బింగి జంగయ్యయాదవ్, కొత్త చందర్‌గౌడ్, చీరాల నర్సింహ, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, నేతలు జడిగె రమేష్‌యాదవ్, ఏనుగు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.